# పంకజం

అది పల్లెటూరూ కాదు. పట్నవాసమూ కాదు.

శ్రీశ్రీ వర్ణించిన "చావు బ్రతుకుల పొలి మేరలో" ఉక్కిరి బిక్కి రవుతున్న పెద్ద కుగ్రామము. గ్రామీణ వాతావరణములోని స్వచ్ఛతను ఏనాడో కోల్పోయింది; నవనాగరిక జీవిత విధాన సౌకర్యాలను అమర్చుకో లేదు ఏమాత్రమూ ఇంకా. రాజ వీథికి మధ్యగా ప్రవహిస్తుంది మురుగు కాలువ. అనతి దూరంలో గోదావరి ఉన్నా, ఊళ్ళో వెలసిన కిల్లీ దుకాణాలూ కాఫీ హోటళ్ళూ వీనిపై ప్రసరించేది ఈ మురుగు కాలువ నుండి వీచే దుర్గంధ వీచికలే. ఊరి చివర కొచ్చేసరికి ఈ మురుగు కాలువ వైతరణిగా మారుతుంది. ట్రావలర్స్ బంగాళా నుంచి గోదావరి ఒడ్డుకు షికారుగా వెళ్ళాలంటే ముందు ఈ వైతరణిని దాటాలిసిందే. అవతల ఒడ్డున కొంత దూరం నడవాలి కూడా.

ఆ ప్రాంతంలో నేను ఉద్యోగం చేస్తూన్నప్పుడు, తరుచు ఈ ఊళ్ళో మకాము చేయవలసి వచ్చేది; ఊళ్ళో నాకేమీ పని లేదు. కాని, అందమైన ఆ బంగాళాలో మకాము ఏర్పరచుకొని చుట్టు ప్రక్కల ప్రాంతాలలో పర్యటించి వచ్చేవాడను.

ఒకసంవత్సరం, ఎక్కడనుంచి వచ్చారో నాలుగు దొమ్మర కుటుంబాలవాళ్ళు మురుగు కాల్వ అవతల ఒడ్డున గుడిసెలు వేసుకున్నారు. ఈత చాపలు అల్లడమూ, పందులను సాకడమే వీళ్ళ పని ఐనా, అనాదిగా వస్తూన్న వాళ్ళ కుల వృత్తిని అనుసరిస్తూ పరిసర గ్రామాల యువకుల ఆరోగ్య క్షీణతకు బాగా తోడ్పడసాగారు. చీకటి పడితే, మర్యాదస్తులు ఆవేపుకు వెళ్ళటానికి భయం అన్నంతగా ముదిరిపోయాయి పరిస్థితులు, ఆ కాలవ గట్టున.

నాకు ఉదయపు షికారు తప్పని సరి. బంగళా నుంచి బయలుదేరి, గోదావరి ఒడ్డుకు వెళ్ళి కాసేపు కూర్చుని ఆ గంగలోనే స్నానంచేసి వచ్చేవాడను. కాని, ప్రతి సారీ ఈ వైతరణిని దాటక తప్పేది కాదు, ఎంత బాధగా ఉన్నా.

ఒక రోజున సూర్యోదయపు వేళ ఇలా కాలువ వొడ్డున తలవంచుకు చరచరా నడిచి వెళ్ళిపోతుంటే బాటప్రక్కనే ఒక పాపాయి కనిపించింది. టక్కున ఆగిపోయాను.

చికిరి చాపమీద పరచిన జిడ్డు ఓడుతూన్న నల్లని ముతక దుప్పటీమీద వెల్లికిలా పడుకుని, నిర్మలమైన ఆకాశం కేసి చూస్తూ, కేరింతాలు కొడుతోంది దబ్బపండు వంటి అర్భకురాలు. ఏ తల్లి తొడిగిందో ఎర్రని చిట్టి పావడా, ఆకు పచ్చని చిట్టి చొక్కా. మెళ్ళో రంగు రంగుల పూసల మధ్య పులిగోరు తాయత్తు. దొండపండు లాంటి లేత పెదవుల మధ్య చిరునవ్వు తాండవిస్తోంది. జీడి గింజలకంటె నల్లని ముంగురులు గాలిలో అల్లలాడుతున్నాయి. అలా చూస్తూ ఉండిపోయాను.

ఉన్నట్టుండి, బాల కిన్నెర స్వరము నా చెవుల నానంద పరచింది. వచ్చీరాని జిలిబిలి పలుకులతో పాపాయి పాడుతోంది - గంగా గౌరీ దేవి సంవాదంలో ఒక చరణము.

ఎల్లా అలవరచుకున్నదో ఈ చిన్నికూన పెద్దవాళ్ళు పాడే ఆ పాటవరుసా, ఆ ఎత్తిపొడుపు తీరూను! మాటలలోని అభిప్రాయం తనకు అనుభవ మవుతూన్నట్లే పాడుతోంది అర్థం కాని పలుకులలో అతి శ్రావ్యంగా! గంగమ్మతల్లీ, గౌరీ దేవి ఒక్కసారిగా నా కళ్ళ ఎదుట సాక్షాత్కరించారు.

నన్ను చూచి చటుక్కున పాట ఆపివేసింది. లేచి కూర్చుంది ఆ చిట్టి తల్లి చిరునవ్వు నవ్వుతూనే. నాలో వెల్లువైవచ్చే ఆపేక్షను బలవంతాన అణచుకుని, నా చొక్కా జేబులో ఉన్న చిల్లరంతా గుప్పిట్లోకి తీసుకుని "ఇంద" అంటూ పాపాయికి ఇవ్వబోయాను. లేచి నుంచుని, క్రొత్త మనిషిని చూచి బెదురుతుంటూ, రెండడుగులు వెనక్కు వేసింది, పసిపిల్ల.

నేను ముందుకు వెళ్ళబోయాను; పాప మరి రెండు అడుగులు వెనక్కు వేసింది ఈసారి ఇంకా ఎక్కువగా బెదిరిపోతూ.

ఇంతట్లోకే, అవతల, కుంపటి వద్ద చలి గాచుకుంటూన్న ముసలి అవ్వ గొంతు వినిపించింది, కాకి స్వరంతో: "పుచ్చుగో! అయ్యగారు ఇస్తున్నారు. వద్దనకూడదు; పుచ్చుగో!!" అంటూ, చుట్ట త్రాగుతూ, మధ్య మధ్య పొగ వదుల్తూ.

ఆవేపు చూచాను; పట్టరాని రోతతో కళ్ళు మూసుకున్నా. అబ్బా! మనుషులూ ఇలా ఐపోతారా, అనుకుంటూ నా నరనరాలు కంపించిపోయాయి.

గుప్పిటిలోని డబ్బులను దుప్పటిపైన రాల్చి, రివ్వున ముందుకు సాగిపోయాను. పాపాయికేసి తిరిగి చూడడానికి కూడా బుద్ధి పుట్ట లేదు.

నాలుగే నాలుగు అడుగులు వేశాను. ఎడమవైపు గుడిసె వెదురు తలుపు వెనుక నుంచి స్త్రీ కంఠం వినిపించింది: "ఒక్క క్షణం లోపలకు వచ్చి వెళ్ళరాదూ!" అంటూ.

కొరడా దెబ్బ తగిలిన వానిలా త్రుళ్ళి పడ్డాను.

ఈ కోకిల కంఠ స్వరములో పాపాయి తీయని గొంతు వినిపించింది నాకు.

చివాలున అక్కడ వ్రాలి అమాంతంగా పాపాయిని నా హృదయానికి హత్తుకుని ఆ లేత తామర పువ్వును ఈ బురదలోంచి పెకలించుకు పోవాలనే వెర్రి ఆవేశం క్రమ్ముకుపోయింది ఆపాద మస్తకమూ నన్ను. ఒక్క అడుగు వెనక్కు వేశాను కూడా.

కాని నాలో ఎవరో అన్నారు:

"నువ్వెవరవు? పాపను హృదయానికి హత్తుకుని ఎత్తుకుపోవడానికి నీ కేమి హక్కుండి-పో! ఇక్కడనుంచి పో! పో! ఇంకా వెళ్ళవేమి!!" అంటూ.

చరాచరా నడచి వెళ్ళిపోయాను గోదావరి వైపు.

నా విధిని నేను నెరవేర్పలేని దుర్బలుడను నేను-బురదలోంచి తామర పువ్వును పెకలింపలేని అసమర్థుడిని నేను... ఎన్ని అనుకుంటే ఏమి లాభం!

నా "పంకజం" ఎక్కడున్నదో ఇప్పుడు? ●

చంట జానకిరామ్